క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని శ్లోక సీబీఎస్ఈ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి రన్నింగ్ 800 మీటర్స్, షాట్‌పుట్ పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో వారు మాట్లాడుతూ..రన్నింగ్ 800 మీటర్ల పోటీలకు అజయ్‌రెడ్డి, షాట్‌పుట్ పోటీలకు షేక్ మహమ్మద్ ముదాస్సిర్ ఎంపికయ్యారని చెప్పారు. గతనెల 25–29వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించిన సౌత్ జోన్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 5, 6, 7వ తేదీల్లో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

ఉక్కు పరిశ్రమను రక్షించుకునేందుకు పోరాటం



పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నందికొట్కూరు: విశాఖ, కడప ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం పోరాటానికి సిద్ధం కావాలని విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు రాంబాబు, శ్రీనివాసులు, కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉక్కు పరిశ్రమల పరిరక్షణ కోసం ఈ నెల 8వ తేదీన తలపెట్టిన విద్యాసంస్థల బంద్ పోస్టర్లను పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకోవడం తగదని హెచ్చరించారు. నాయకులు మద్రిస్వామి, రంగస్వామి, మహానంది, నవీన్, వినోద్, హరి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇంటింటికీ కుళాయి



కుళాయిలు ఏర్పాటు చేసిన దృశ్యం

మిడుతూరు: జగనన్న కాలనీలో నూతన గృహాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు జలజీవన్ మిషన్ ద్వారా నూతన పైపులైన్‌తో పాటు, ఇంటింటికీ కుళాయిని అమర్చినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్, హౌసింగ్ ఏఈ రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కడుమూరు జగనన్న కాలనీలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు, బోరు బావిలో నుంచి మోటార్‌ను బయటకు తీశారు. సర్పంచ్ జీవరత్నం ఉన్నారు.

సచివాలయాల్లో డిజిటల్ చెల్లింపులు



పంచాయతీ కార్యదర్శులకు పీఓఎస్ మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ

నందికొట్కూరు రూరల్ : మండలంలోని గ్రామ సచివాలయాల్లో ప్రజలు డిజిటల్ చెల్లింపులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీఓ శోభారాణి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు పీఓఎస్ మిషన్లు, క్యూఆర్ కోడ్‌లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు సచివాలయాల్లో నీటి, ఇంటిపన్నులకు సంబంధించిన చెల్లింపులను ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా కూడా చెల్లించవచ్చని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జెడ్పీటీసీ కరిమున్నిసా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్ : మండలంలోని కొణిదేల గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేయాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ కాంతారెడ్డి ఉన్నారు.

శిక్షణ పొందితేనే లైసెన్స్

- డ్రైవింగ్ స్కూళ్లల్లో ఇక నుంచి హాజరు అమలు
- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- శిక్షణ పొందే వారికి బయోమెట్రిక్ హాజరు

డ్రైవింగ్ స్కూళ్ల వివరాలు..	
నంద్యాల జిల్లాలో డ్రైవింగ్ స్కూళ్లు	41
ఆర్టీసీ ద్వారా నిర్వహించేవి	1
ప్రైవేట్‌గా నడుస్తున్నవి	32
తరగతులు నిర్వహించే రోజులు	30
ప్రతి ఏటా జారీ చేసే భారీ వాహనాల లైసెన్స్‌లు దాదాపు	1,200



నంద్యాల ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న బ్యాచ్ (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): చేయితడపనిదే పనికాదంటూ ప్రాచుర్యం పొందిన రవాణా శాఖ కార్యాలయాలను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఆర్టీఏకు సంబంధించి ఇప్పటికే దాదాపు 30కి పైగా సేవలు సచివాలయాల ద్వారా అందిస్తోంది. తాజాగా భారీ వాహనాలు నడపడానికి జారీచేసే హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలనుకొనే వారికి డ్రైవింగ్ స్కూల్‌లో బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది. ఇందుకు సంబంధించి గత ఏడాది నవంబర్‌లో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయగా తాజాగా గెజిట్ విడుదల చేసింది. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ముందుగా ఎల్ఎల్ఆర్ పొంది ఆరు నెలల్లో గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్ల ద్వారా సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. వారు జారీ చేసిన సర్టిఫికెట్ ద్వారా ఎంవీఐ హోదా కలిగిన అధికారి లైసెన్స్ జారీ చేస్తారు. గతంలో ఈ సర్టిఫికెట్ కోసం డ్రైవింగ్ స్కూల్‌కి రోజూ వెళ్లకపోయినా పని అయిపోయేది. నెల చివరలో వెళ్లి ఒకేసారి 30 రోజుల సంతకాలు చేసేసి, డబ్బు చెల్లిస్తే ట్రైనింగ్ ధ్రువ పత్రం ఇచ్చేవారు. ఈ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి నెలరోజుల పాటు రోజూ శిక్షణకు తప్పకుండా హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉదయం తరగతులు, మధ్యాహ్నం డ్రైవింగ్ పరీక్షలు ఇప్పటికే నిర్వహిస్తుండగా తాజాగా రవాణా శాఖ చట్ట సవరణ చేసింది.

నూతన నిబంధనలు ఇలా..

- శిక్షణ పొందేవారు, ఇన్‌స్ట్రక్టర్లు బయో మెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- డ్రైవింగ్ స్కూల్‌లో 25 మంది బ్యాచ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్ ఉండాలి.
- ఇన్‌స్ట్రక్టర్ తప్పనిసరిగా డిప్లొమా ఇన్ మోకానికల్ ఇంజినీరింగ్ లేదా డిప్లొమా ఇన్ ఆటో మొబైల్ ఇంజినీరింగ్ లేదా ఐటీఐలో డీజిల్ మెకానిక్ చేసి ఉండాలి.
- ప్రతి డ్రైవింగ్ స్కూల్.. ఫీజు చెల్లింపు, శిక్షణ స్లాట్ బుకింగ్, డ్రైవింగ్ శిక్షణ తదితరాల కోసం ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తీసుకురావాలి.
- రవాణాశాఖ నిర్దేశించిన ఫీజునే వసూలు చేయాలి.
- శిక్షణ పొందే వారికి హాస్టల్ సదుపాయం ఉండాలి. ముఖ్యంగా ప్రతి డ్రైవింగ్ స్కూల్ సొంత ట్రాక్ కలిగి ఉండాలి.

కొత్త మార్పులతో గెజిట్



హెవీ డ్రైవింగ్ లైసెన్స్ జారీ విధానంలో కొత్తగా మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఏంవీఐ స్థాయి అధికారిని డ్రైవింగ్ స్కూల్ పర్యవేక్షణకు నియమించాం. రోజూ అభ్యర్థి తరగతులకు హాజరు కావలసిందే. తరగతికి హాజరైన వారి సంఖ్య ఏరోజుకారోజు ఆన్‌లైన్ ద్వారా సమీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. శిక్షణకు పూర్తిగా హాజరు కావడం ద్వారా డ్రైవింగ్‌లో మెళకువలతో పాటు జాగ్రత్తలపై అవగాహన కలుగుతుంది. నిబంధనలు పాటించని డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం.
– శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

ఓటరు నమోదుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో దాసు

నందికొట్కూరు రూరల్ : నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేయించుకునేలా అధికారులు దృష్టి సారించాలని ఆర్డీవో దాసు సూచించారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డ్రాఫ్టు ఓటరు జాబితాను ప్రచురించామని ఓటరు లిస్టులో ఏవైనా తప్పులు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు అధికారులు, బీఎల్‌వోల దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి శని, ఆదివారాల్లో మండలంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఉపాధి’ నిధులతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ సువర్ణమ్మ

జూపాడుబంగ్లా: రూ.60లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలోని గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ సువర్ణమ్మ, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటల దిగుబడి తగ్గినట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైనందున మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని తీర్మానం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రెఫర్ చేసిన 101 మంది రోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తున్నట్లు వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఇచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు అన్నిశాఖల అధికారులు కృషిచేయాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్ కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సర్పంచులు నాగార్జునరెడ్డి, మాధవి, ఈశ్వరయ్య, బాలమద్దిలేటి, పీఎం నాగిరెడ్డి, ఎంపీటీసీలు మోతెవెంకటరమ్మ, వైస్ ఎంపీపీలు కృష్ణారెడ్డి, రవణమ్మ, మిద్దెనీలమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

పాములపాడు: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల నాయకుడు వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించలేదన్నారు. కేసీ కెనాల్ ఉన్నప్పటికీ అరకొరగా నీరు రావడం వల్ల చాలా మంది రైతులు పొలాలకు నీరు మళ్లించలేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మండలంలో పర్యటించి రైతుల పరిస్థితిని గమనించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. పార్టీ నాయకులు శ్రీనివాసులు, రంగస్వామి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా రాక

మహానంది: ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం మహానందికి వస్తున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సొంతంగా రూ.3కోట్లు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వస్తున్నారని చెప్పారు.

తహసీల్దార్‌కు తెలియకుండానే..!

మహానంది: బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు తెలియకుండానే ఓ చిరుద్యోగి దీర్ఘకాలిక సెలవులపై వెళ్లిన విషయం మండలంలో చర్చనీయాంశమైంది. ఇటీవల ఓ జూనియర్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై అక్కడ బాధ్యతలు చేపట్టారు. అయితే కొన్ని రోజుల క్రితం ఓ ఉన్నతాధికారి మందలించారని, దీంతో దీర్ఘకాలిక సెలవులపై వెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై తహసీల్దార్ రవికుమార్‌ను శుక్రవారం వివరణ కోరగా తనకు తెలియదని, నా దృష్టికి రాలేదని చెప్పారు.

మహానందిలో రూ. 40 లక్షలతో సీసీ రోడ్లు

మహానంది: దేవస్థానం ప్రాంగణంలో రూ.40లక్షలతో నూతనంగా నాలుగు సీసీ రహదారులు నిర్మించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహానందిలోని టీటీడీ కల్యాణమండపం, ఆలయం ముందు ఉన్న జిందాల్ ప్లాంటు వద్ద, గాజులపల్లె వెళ్లే మార్గంలో సీసీ రోడ్లుతో పాటు కల్వర్టు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. రహదారుల నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని, రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శుక్రవారం షష్టిని పురస్కరించుకుని ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏర్పాటు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలోని వైఎస్సార్ క్రాంతి పథం ఎల్–1, ఎల్–2 ఉద్యోగుల నూతనం సంక్షేమ సంఘం ఏర్పాటైందని అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ డీఆర్‌డీఏ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డిని కలిశారు. సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అధ్యక్షతన జరగబోయే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. అలాగే అన్ని శాఖల అధికారులు సమగ్ర ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

నేడు పాత ముచ్చుమర్రిలో ‘గడప గడపకు..’ కార్యక్రమం

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొంటున్నందున అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

హిందూ సంప్రదాయాలను ఆచరించాలి

జూపాడుబంగ్లా: హిందూ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించటంతో పాటు తమ పిల్లలకు తెలియజేస్తూ వారు ఆచరించేలా చేయాలని జిల్లా కన్వీనర్ మాధవరెడ్డి, జిల్లా ధర్మప్రచారక్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం తర్తూరు గ్రామంలో హిందూ ధర్మ ప్రచారక్ మండల కన్వీనర్ లక్ష్మన్న అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అణగారిపోతున్న హిందూ ధర్మ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, 80బన్నూరు మద్దిలేటిరెడ్డి(నానిరెడ్డి), నందికొట్కూరు సబ్‌డివిజన్ కన్వీనర్ అల్వాల బాలయ్య పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని ఏనుగుల చెరువు సమీపంలోనున్న ఓ ఆశ్రమంలో నిర్వహణ విధుల్లో ఉన్న బీజేపీ జిల్లా కార్యదర్శి అరవింద్‌రెడ్డిపై గురువారం మధ్యాహ్నం కొందరు యువకులు దాడి చేశారు. వన్ టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న సమయంలో మొబైల్ క్యాంటిన్ నిర్వహించే శివ, మరో ఇద్దరు కర్రతో అరవింద్‌రెడ్డిపై దాడి చేశారు. అయితే దాడికి పాల్పడిన వారు అరవింద్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారని దీంతో ఇరువర్గాలపై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

వెలుగోడు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశామని ఏవో పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్‌బీకేల్లో వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట పొలాలలో ఎలుక నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఇందు కోసం రైతులకు ఉచితంగా ఎలకల మందు పంపిణీ చేసినట్లు చెప్పారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకష్ణ, నాగమణి, అప్సర్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులును అరెస్ట్ చేసి ఎనిమిది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. సారా విక్రయిస్తున్న శ్రీనును అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



నూతనంగా ప్రారంభించిన దుకాణంలో లబ్ధిదారుతో అధికారులు



ఫ్లోర్‌మిల్ ప్రారంభిస్తున్న పీడీ శ్రీధర్ రెడ్డి



కృష్ణారావుపేట బ్రాంచ్ మేనేజర్‌కు వివరాల జాబితా అందిస్తున్న పశు వైద్యాధికారి

పాములపాడు: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ, వైకేపీ పీడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జూటూరు గ్రామంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం క్రింద గ్రామానికి చెందిన చిలుక వెంకటరమణమ్మకు రూ.1,06,000 లను కృష్ణారావుపేట యూనియన్ బ్యాంక్ మంజూరు చేయడంతో జిరాక్స్, కలర్ పీవీసీ, ల్యామినేషన్ మిషన్లతో ఏర్పాటు చేసిన దుకాణాన్ని సర్పంచు నాయిని సావిత్రమ్మ ప్రారంభించారు. 35 శాతం సబ్సిడీ వర్తిసుదని పీడీ వివరించారు. నాయకులు నాయిని మద్దిలేటి, బ్రాంచ్ మేనేజర్ తిమ్మప్ప, ఏసీ పుల్లయ్య, ఏపీఎం అనురాధ, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్ల ప్రారంభం

ఆత్మకూరురూరల్: వైఎస్సార్ క్రాంతిపథంలో భాగంగా మహిళా సాధికారత కోసం మంజూరు చేసిన రెండు స్వయం ఉపాధి యూనిట్లను డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని కురుకుంద, కొట్టాల చెర్వు గ్రామాల్లో పథకం కింద ఫ్లోర్ మిల్, ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. కొట్టాల చెర్వుకు చెందిన సాజిదాబేగంకు ఐస్ మేకింగ్ యూనిట్ కోసం రూ.3,90,000, కురుకుందకు చెందిన కృపామణికి ఫ్లోర్ మిల్ కోసం రూ.1,10,000 మంజూరు చేశారు. ఏరియా కో – ఆర్డినేటర్ పుల్లయ్య, డీపీఎంయూ ఏపీఎం బాబురావు, ఏపీఎం ఉమా, సీసీ రమణ,బుక్ కీపర్ తిమ్మదాసు సరళ పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: పాడి రైతులు పశు కిసాన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పశు వైద్యాధికారి అనిల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కృష్ణారావుపేట, పాములపాడు యూనియన్ బ్యాంకు మేనేజర్లను కలిసి వివరాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాడి రైతుల అర్హతలు, బ్యాంకు వారు నిర్ణయించిన రేట్ల ప్రకారం రుణాలు ఇస్తారన్నారు. అర్హులైన రైతులకు బ్యాంకు పూచీకత్తు లేకుండా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు మీసేవలో అందుబాటులో ఉన్నాయని, బ్యాంక్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి పశువైద్యశాలలో ఒకటి, బ్యాంకులో ఒకటి ఇవ్వాలని సూచించారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకోత్సవం



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ తదితరులు స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. అనంతరం నాలుగు దిక్కుల్లో బలిహరణ, నందీశ్వర పూజలు చేసి ఆలయ ప్రాకారాల్లో పల్లకీత్సవం జరిపించారు. దాతలు వారణాసి రామ్మోహన్‌రావు, పండితులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



ఏఈ, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఈఈ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని పంచాయతీ రాజ్ ఈఈ రామ్మోహన్ రెడ్డి సూచించారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం–నారాయణపురం గ్రామాల మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈఈ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు పనులను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నిబంధనల మేరకు వివరాలు సమర్పించాలని ఆదేశించారు. డీఈ వెంకటరెడ్డి, ఏఈ వెంకటయ్య, కాంట్రాక్టర్ చక్రపాణితో వివిధ అంశాలపై చర్చించారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

నంద్యాల(న్యూటౌన్): రోడ్డు భద్రతా నియమాలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతిరాం మెడికల్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ తదితర అంశాలను ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. రాత్రి వేళల్లో వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.సెల్‌ఫోన్ డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్రవాహనాలపై ముగ్గురు లేదా నలుగురు వెళ్లడం, ఓవర్ స్పీడ్ తదితర అంశాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. రవాణా శాఖ అధికారులు శ్రీకాంత్, రవి శంకర్‌నాయక్, తిమ్మరుసు నాయుడు, క్రాంతి కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న చంద్రనాయక్

నంద్యాల(అర్బన్): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలని ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ చంద్రనాయక్ కోరారు. స్థానిక నిశాంత్ భవన్‌లో శుక్రవారం ఎస్ఎస్ఆర్–2024 స్పెషల్ క్యాంపైన్ డే సందర్భంగా బీఎల్ఓలు, సచివాలయ వీఆర్ఓలతో ఓట్లలో తప్పు ఒప్పులను సవరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ కాంపైన్‌డే కింద శని, ఆదివారాలతో పాటు డిసెంబర్ 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్ఓలు నూతన ఓటరు జాబితాతో హాజరు కావాలని సూచించారు. ఫారం–6, 7, 8, 6బీలను స్వీకరించి కొత్త ఓటరు నమోదుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

మిరప పంట పరిశీలన



పాణ్యం వద్ద మిరప రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా మిరప పంట పెరుగుదల ఆశించిన మేర లేకపోవటంతో పాటు, తెగుళ్ల ఉధృతి అధికంగా ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి యూ.నాగరాజు తెలిపారు. రెండ్రోజులుగా ఆయన తన బృందంతో కలిసి జిల్లాలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, పాణ్యం, మిడుతూరు మండలాల్లో పర్యటిస్తున్నారు. బెట్ట పరిస్థితుల కారణంగా అన్నదాతలు సరైన సమయంలో మిరపలో అంతరకృషి చేయలేకపోయారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న పంటల్ని కాపాడుకోవటానికి అనుసరించాల్సిన పద్ధతుల్ని అన్నదాతలకు సమగ్రంగా తెలిపామన్నారు. నీటి ఎద్దడిని తట్టుకుని మొక్క ఎదిగేందుకు యూరియా 10–20 గ్రా./పొటాషియం నైట్రేట్ 2.5–5 గ్రా.లీటరు నీటికి కలిపి వారానికొకసారి పిచికారీ చేయాలని సూచించారు. భూమి మందుల్ని సైతం మొక్క గ్రహించే పరిస్థితి లేనందున స్థూల పోషకాల (19–19–19)5 గ్రా./ లీటరు నీటికి, సూక్ష్మ పోషకాల(అగ్రోమిన్ మాక్స్)–2.5 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పోషక లోపాన్ని నివారించవచ్చన్నారు.